# శ్రీ మాడపాటి హనుమంతరావు

శ్రీ మాడపాటి హనుమంతరావు 1958 వ సంవత్సరం జూలై 7 వ తేదీన ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు తొలి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికై 1960 సంవత్సరం జూన్ 30 తేదీ వరకు, 1960 వ సంవత్సరం జూలై 11 వ తేదీ నుండి 1964 వ సంవత్సరం జూలై 20 వ తేదీ వరకు ఆ పదవిలో కొనసాగారు.

ఆంధ్ర పితామహ శ్రీ మాడపాటి హనుమంతరావు కృష్ణా జిల్లా నందిగామ తాలూకాలోని పొక్కునూరు గ్రామంలో 1885 వ సంవత్సరం జనవరి 22వ తేదీన శ్రీ వెంకటప్పయ్య, శ్రీమతి వెంకట సుబ్బమ్మలకు జన్మించారు.

శ్రీ హనుమంతరావు సూర్యాపేట, జడ్చర్ల, నల్గొండలలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసారు. 1893 వ సంవత్సరంలో ఉర్దూ మిడిల్ పరీక్షలో ఉత్తీర్ణులైనారు. 1903 వ సంవత్సరంలో వరంగల్ జిల్లాలోని హైస్కూల్ నుంచి మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులైన తరువాత 1904 వ సంవత్సరంలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మీర్ మున్షి ఉద్యోగంలో చేరి ఎనిమిది సంవత్సరములు పనిచేసారు. నిజాం రాష్ట్ర న్యాయ శాఖలో పనిచేస్తూ లా పరీక్షలలో ఉత్తీర్ణులై 1917 లో న్యాయవాద వృత్తిని స్వీకరించి అన్యాయాలకు గురైన పేద, బడుగు వర్గాల వారి కేసులను చేపట్టి ఉచితంగా న్యాయ పోరాటం చేసి ఉన్నత విలువలు గల న్యాయవాదిగా కీర్తి గడించారు.

శ్రీ మాడపాటి హనుమంతరావు 1951 వ సంవత్సరంలో హైదరాబాదు నగర పాలక సంఘానికి ప్రథమ మేయరుగా ఎన్నికై 1954 వరకు పదవిలో కొనసాగి నగరాభివృద్ధికి ఎంతగానో కృషి చేసారు. హైదరాబాదు రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత శ్రీ మాడపాటిని ఉస్మానియా యూనివర్సిటీ సెనేటుకు శాశ్వత సభ్యులుగా ప్రభుత్వం నియమించింది.

శ్రీ మాడపాటి 1958 వ సంవత్సరం జూలై 7 వ తేదీ నుండి 1960 వ సంవత్సరం జూన్ 30 వ తేదీ వరకు, 1960 వ సంవత్సరం జూలై 1 వ తేదీ నుండి 1966 వ సంవత్సరం జూన్ 30 వ తేదీ వరకు శాసన సభ నియోజక వర్గం నుండి శాసన పరిషత్తు సభ్యులుగా ఉన్నారు.

నిజాం నిరంకుశ పాలనలో తెలుగువారు అనుభవించే బాధలు చూడలేక తెలుగువారి ఉనికిని కాపాడటానికి తెలంగాణా ప్రాంతంలో ఆంధ్రోద్యమాన్ని వ్యాపింపజేసిన నాయకులలో శ్రీ మాడపాటి ముఖ్యులు. శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ బూర్గుల రామకృష్ణారావు, శ్రీ కొండా వెంకట రంగారెడ్డి, శ్రీ యం. నరసింగరావు మొదలగు యువకుల సహకారంతో ఆంధ్ర మహాసభలు నిర్వహించి, తెలంగాణలో నివసించే తెలుగు ప్రజల్ని రాజకీయంగా జాగృతం చేసారు.

1904 వ సంవత్సరంలో హన్మకొండలో శ్రీ రాజరాజ నరేంద్ర ఆంధ్ర భాషా నిలయం స్థాపించి దాని అభివృద్ధికి కృషి చేసారు. 1912 వ సంవత్సరంలో శ్రీ కృష్ణ దేవరాయ ఆంధ్ర భాషా నిలయంలో సభ్యునిగా చేరి 1914-15 సంవత్సరంలో దానికి కార్యదర్శిగా పనిచేసి స్వంత భవన నిర్మాణానికై కృషి చేసారు. శ్రీ కృష్ణ దేవరాయ ఆంధ్రభాషా నిలయాభివృద్ధికి శ్రీ హనుమంతరావుగారు నిర్వహించిన పాత్ర శ్లాఘనీయమైనది. శ్రీ హనుమంతరావు గౌలిగూడలో బాల సరస్వతీ గ్రంథాలయం, నాంపల్లిలో వేమనాంధ్రభాషా నిలయం మాత్రమే కాక తెలంగాణా జిల్లాలలో అనేక గ్రంథాలయాల స్థాపనకై కృషి చేసినారు.

తెలంగాణాలో విద్యాభివృద్ధికి, మహిళాభ్యుదయానికి రావు గారు చేసిన సేవ శ్లాఘనీయమైనది. 1930 వ సంవత్సరంలో పరోపకారిణీ బాలికా పాఠశాల నిర్వహణ భారం వహించి బాలికల విద్యావ్యాప్తికి కృషి చేసారు. హైదరాబాదులో రాజబహదూర్ వెంకట్రామరెడ్డి మహిళా కళాశాల, సుల్తాన్ బజార్ సమీపంలోని మాడపాటి బాలికల హైస్కూలు ఏర్పాటులో వీరు ప్రముఖ పాత్ర వహించారు.

నీలగిరి, గోల్కొండ, తెనుగు పత్రిక, సుజాత మొదలైన పత్రికలలో రావుగారు అనేక విషయాల మీద ఎన్నో అమూల్యమైన వ్యాసాలను వ్రాసారు. 'ముషీరెదక్కన్' అనే ఉర్దూ పత్రికలో కూడా వ్యాసాలు వ్రాసారు.

శ్రీ హనుమంతరావు గారు రచయిత, కవి, సాహిత్యవేత్త, పండితుడు. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ, సంస్కృత, పార్సీ భాషలలో మంచి ప్రావీణ్యం గల బహు భాషా కోవిదుడు. బంకించంద్ర ఛటర్జీ వ్రాసిన "ఆనందమఠం" ను తెలుగులోనికి అనువదించారు. 1911 సంవత్సరంలో "గారిబాల్డీ" జీవిత చరిత్రను వ్రాసారు.

రామకసామ్రాజ్య చరిత్రము, క్షాత్రకాలపు హిందూవార్తలు మొదలైన పుస్తకాలను రచించారు.

1955 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం శ్రీ మాడపాటికి "పద్మభూషణ్" అవార్డునిచ్చి సత్కరించింది. తరువాత 1956 వ సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం "గౌరవ డాక్టరేటు" బిరుదును ప్రదానం చేసింది.

అకళంక దేశభక్తుడు, గొప్ప ప్రజా సేవకుడు, ఆంధ్రోద్యమ వైతాళికుడు అయిన శ్రీ మాడపాటి హనుమంతరావు 1970 వ సంవత్సరం నవంబరు, 11 వ తేదీన మరణించారు.